మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

హామీలు అమలు చేసే వరకు వెంటాడుతం..

ఎల్లవేళ లా ప్రజల పక్షాన పోరాటం ■ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట, ఆగస్టు 9 : కొత్త ప్రభుత్వమని కొంతకాలం మౌనంగా ఉన్నామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు వెంటాడుతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని మైలారంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ అమలు చేసిన రైతుబంధు పథకాన్ని ఎత్తేసే కుట్రలు చేస్తున్నారని, ఎలా తొలగించాలో కారణాలు వెతుకుతున్నట్లు ఆరోపించారు. కేసీఆర్ పరిపాలన రైతు పక్షపాతిగా సాగిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారం చేపట్టి 8 నెలలైనా కాలయాపన చేస్తున్నారే తప్పా హామీలను అమలు చేయడం లేదన్నారు. రుణమాఫీ విషయంలో ఇది తేటతెల్లమైందన్నారు. రూ.లక్ష, రూ.లక్షా50 వేల వరకు పూర్తయిందని చెబుతున్నారని కానీ, చాలామంది రైతులు రుణమాఫీ కాక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. రైతుభరోసా ఇస్తారా? ఇవ్వరా? తేల్చాలన్నారు. రుణమాఫీకి సంబంధించి బీఆర్ఎస్ వాట్సాప్ నంబర్ ఇస్తే ఒకే రోజు 50 వేలకుపైగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వ పనితనం అర్థమవుతుందన్నారు. ప్రజలు సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అలాగే పత్రికా విలేకరి రంగు శ్రీధర్ తల్లి చెన్నమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, రాంశెట్టి లక్ష్మారెడ్డి, అరికిల్ల దేవయ్య, దూదిపాల తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, సదయ్య, కొమ్ముల శివ, గాజే రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

12న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ 12న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. పాలీసెట్-24 ఉత్తీర్ణులై డిప్లొమా ప్రవేశం పొందని విద్యార్థులు, ఉత్తీర్ణులు కానీ విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 7 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు పాలిటెక్నిక్ కాలేజీలో 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాలీసెట్ ర్యాంక్, ఆధార్ కార్డులు, ఎసెస్సీ మెమో, స్టడీ, టీసీ, కుల, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక కాపీ జిరాక్స్ సెట్ తీసుకురావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు కాలేజీ రుసుం రూ.5,080 ఫీజుతో పాటుగా ప్రాసెసింగ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ రూ.300(పాలీసెట్ క్వాలిఫైడ్) రూ.550(పాలీసెట్ క్వాలిఫైడ్ కానీవారు) ఇతరులు రూ.600 (పాలీసెట్ క్వాలిఫైడ్) రూ.1100 (పాలీసెట్ క్వాలిఫైడ్ కానీవారు) చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

20 నుంచి కేయూ బీఈడీ రెండో సెమిస్టర్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9: కేయూ బీఈడీ (రెండో సెమిస్టర్) పరీక్ష టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీ నాగరాజు శుక్రవారం విడుదల చేశారు. 20, 22, 24, 27న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని, మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.kakatiya.ac.inలో ఉన్నాయన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి భూమి పూజ

హసన్‌పర్తి, ఆగస్టు 9 : 65 డివిజన్ పరిధి మునిపల్లిలో శివాలయం పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. ఆలయ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీ మహేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కిషన్, జిల్లా నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, ఏరుకొండ శ్రీనివాస్, సారయ్య, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి

పరకాల, ఆగస్టు 9 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పల్లె దవాఖాన, నార్లాపూర్ గ్రామంలో చెక్‌డ్యాంను పరిశీలించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వ్యాగన్ పీవోహెచ్ షెడ్ తనిఖీ

కాజీపేట, ఆగస్టు 9 : కాజీపేట రైల్వే పరిసరాల్లో ఏర్పాటు చేస్తున్న రైల్వే వ్యాగన్ పీవోహెచ్ షెడ్‌ను శుక్రవారం రైల్వే (డీసీఎంఈ) ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ మధుసూదన్‌రావు రైల్వే అధికారుల బృందంతో కలిసి తనిఖీ చేశారు. షెడ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో షెడ్ ఆవరణలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎన్ఎల్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ, రైల్వే అధికారుల బృందం పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

- సీపీ అంబర్ కిశోర్‌ఝా
- గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం
- కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

సుబేదారి, ఆగస్టు 9 : చెట్లతోనే పర్యావరణం పరిరక్షించబడుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శనివారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు పాల్గొన్నారు.

మడికొండ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని సీపీ అంబర్ కిశోర్‌ఝా సూచించారు. మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ప్రతాప్, ట్రైనీ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి : జడ్పీసీఈఓ విద్యాలత

కమలాపూర్ : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని జడ్పీసీఈవో విద్యాలత కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబాల, శ్రీరాంలపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు మొక్కలు నాటి ప్రతి ఇంటిని పచ్చదనంతో నింపాలన్నారు. మొక్కల పెంపకంతో వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో బాబు, ఎంపీవో రవి, ఏవో లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సుబేదారి : మొక్క నాటుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మొక్కలను నాటి సంరక్షించాలి

దామెర : మండలంలోని సింగరాజుపల్లి, దామెర గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపీవో శారద, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, సీనియర్ అసిస్టెంట్ విష్ణు, జూనియర్ అసిస్టెంట్ సతీశ్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

జూ పార్క్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం

హనుమకొండ : హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూ పార్కులో శుక్రవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. పార్కులో పెరిగిన మొక్కలు, చెత్తాచెదారంను తొలగించారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు రేంజ్ ఆఫీసర్ జే శిరీష, సెక్షన్ ఆఫీసర్ డీ రాందాస్, బీట్ ఆఫీసర్లు టీ సురేశ్, శారద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత సమాజం కోసం కృషి చేయాలి

కాజీపేట : డివిజన్‌లో విరివిగా మొక్కలు నాటి కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేయాలని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. కాజీపేట పట్టణం సోమిడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఏఈ రామన్న, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, శానిటేషన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎమ్మెల్యే నాగరాజు

నయీంనగర్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని రక్షించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ తానాజీ, కార్పొరేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో గంజాయి స్వాధీనం

పరకాల, ఆగస్టు 9 : పరకాల పట్టణంలో ఒకరి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఎస్సై నర్సింహారావు ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అంబేద్కర్ సెంటర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పరకాల పట్టణంలో మటన్ షాపు నిర్వాహకుడు మహ్మద్ నదీమ్‌గా గుర్తించారు. అతడి వద్ద రూ.5వేల విలువ చేసే 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

హసన్‌పర్తి, ఆగస్టు 9 : ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన గరిగె మురళి (60) తన ఇంట్లో లేని సమయంలో అతడి అన్న కొడుకు ప్రవీణ్‌కుమార్ గురువారం రాత్రి ఇంట్లోకి వచ్చి టీవీ, ఫ్యాన్, రిఫ్రిజిరేటర్, రేకులు ధ్వంసం చేశాడు. అడ్డుగా వెళ్లిన మురళి కూతురుపై చేయి చేసుకున్నాడు. దీంతో బాధితులు 100కు డయల్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

హసన్‌పర్తి, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడిన ఘటన శుక్రవారం హసన్‌పర్తిలో జరిగింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. శ్రీరాముల పల్లెకు చెందిన కౌడగాని రవీందర్ తన భార్యతో కలిసి బైక్‌పై హనుమకొండలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగొస్తుండగా, హసన్‌పర్తి బస్టాప్ వద్ద మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌కు బలమైన గాయాలు కాగా, అతడి భార్య స్వల్పంగా గాయపడింది. స్థానికులు 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. వనజ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆదివాసీల దినోత్సవ వేడుకల్లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో విద్యార్థులు

ఆదివాసీల సంస్కృతి సంపన్నమైంది

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9 : ఆదివాసీల సంస్కృతి సంపన్నమైందని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. సెనెట్‌హాల్‌లో 'ప్రపంచ ఆదివాసీల దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ సంస్కృతి పుట్టింది ఆదివాసీల నుంచేనన్నారు. కేయూలో 50 శాతం ఆదివాసీ ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఆదివాసీ విద్యార్థులు పరిశోధనలపై శ్రద్ధ పెట్టాలన్నారు. ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతిరావు మాట్లాడుతూ.. ఆదివాసీలు వారి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. అంతకుముందు మొదటి గేటు నుంచి ఆదివాసీ కల్చరల్ వరకు ర్యాలీని నిర్వహించి, పతాకావిష్కరణ చేశారు.

న్యూశాయంపేట : ఆదివాసీలు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హంటర్‌రోడ్‌లోని శ్రీవ్యాస ఆవాస పాఠశాలలో విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ మనోహరస్వామి, వాసు, సిబ్బంది రమేశ్, రంజిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ఐనవోలు, ఆగస్టు 9 : నాయబ్ తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెగా) జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల నాయబ్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై దుర్భాషలాడినందుకు నిరసరగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాణి, గోపీ, సర్వేయర్ సూరజ్, జయశ్రీ, సాంబరాజు, రమేశ్, మొహినొద్దీన్, శ్రీనివాస్, సత్యం, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కాజీపేట, ఆగస్టు 9 : పేకాడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లోని దండిఅమర్‌నాథ్ ఇంట్లో పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.29,150 నగదు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాజీపేట పీఎస్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9: వేయిస్తంభాల ఆలయంలో నాగుల పంచమిని పురస్కరించుకుని శుక్రవారం ఉత్తిష్ఠగణపతికి ఆరాధన, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగేంద్రస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. వేలాది మంది భక్తులు పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్‌లు నిర్వహించారు. దేవాలయ సిబ్బంది మధుకర్, ఎల్ రామకృష్ణ, రజిత ఏర్పాట్లు చేశారు.

కిక్కిరిసిన భద్రకాళీ ఆలయం

వరంగల్ : నగరంలో ప్రసిద్ధ భద్రకాళీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసంలో తొలి శుక్రవారం కావడంతో పెద్దఎత్తున తరలివచ్చి బారులు తీరారు. గంటల తరబడి లైన్లలో నిలబడి అమ్మవారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు.

హనుమకొండ చౌరస్తా : నాగేంద్రస్వామికి అభిషేకం చేస్తున్న ప్రధానార్చకుడు ఉపేంద్రశర్మ

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- కాళోజీ కళాక్షేత్ర నిర్మాణం పరిశీలన

హనుమకొండ, ఆగస్టు 9 : కాళోజీ కళాక్షేత్రం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హనుమకొండ బాలసముద్రంలో కళాక్షేత్రం నిర్మాణ పనులను ఆమె కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఆడిటోరియం, పెయింటింగ్, టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఆర్ట్ గ్యాలరీ తదితర అభివృద్ధి పనులను కలెక్టర్ పనులు, వాటి పురోగతి వివరాలను కుడా, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఎక్కడ ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో కుడా చైర్మన్ ఇనుగాల

కూతురికి ఉరేసి.. తానూ ఆత్మహత్య

తండ్రి ఓ యూట్యూబ్ చానల్ జర్నలిస్టు

సుబేదారి, ఆగస్టు 9 : జర్నలిస్టు యోగిరెడ్డి తన కూతురికి ఉరేసి, తానూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలో జరిగింది. తొలివెలుగు యూట్యూబ్ చానల్‌లో పనిచేస్తున్న యోగిరెడ్డి(34) హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి బాలసముద్రంలోని చానల్ కార్యాలయంలో కూతురికి ఉరేసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. యోగిరెడ్డి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కూతురును పక్కనే ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. యోగిరెడ్డి హనుమకొండ నక్కలగుట్టలో భార్య, కూతురుతో కలిసి నివాసముంటున్నాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామెర, ఆగస్టు 9: మండలంలోని ఊరుగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఊరుగొండ, పసరగొండ, పులుకుర్తి, సీతారాంపురం, దుర్గపేట గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

శాయంపేట, ఆగస్టు 9 : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన సింధూజ అనారోగ్యంతో బాధపడుతుండగా, శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె తండ్రి సుధాకర్‌కు రూ.1.50లక్షల ఎల్‌వోసి పత్రాన్ని ఎమ్మెల్యే గండ్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ న్యాయవాదుల నిరసన

పరకాల, ఆగస్టు 9 : జనగామ జిల్లాలో న్యాయవాదులపై పోలీసుల దాడికి నిరసనగా శుక్రవారం రెండో రోజు పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో స్థానిక న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల స్వామి మాట్లాడుతూ.. న్యాయవాదులపై దౌర్జన్యం చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కే శ్రీనివాస్, రాజమౌళి, ఎం శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, వెంకటరమణ, రాజేందర్, రమేశ్, రాజు, వేణు, చంద్రమోహన్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

11 మందికి జరిమానా

సుబేదారి, ఆగస్టు 9 : హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరికి రూ.12,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు.

ఇద్దరు యువకుల హల్‌చల్

కాజీపేట, ఆగస్టు 9 : తాగిన మత్తులో చిల్లర డబ్బుల కోసం ఇద్దరు యువకులు ఘర్షణ పడుతూ, హల్‌చల్ సృష్టించిన ఘటన కాజీపేట చౌరస్తా శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏరుకొచ్చిన చెత్తాచెదారం, చిత్తు కాగితాలను ఇద్దరు యువకులు చౌరస్తాలోని రోడ్డుపై కుప్పగా పోశారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు గొడవకు దిగి, కర్రలు, సీసాలతో కొట్టుకున్నారు. అటుగా వెళ్లే ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. పోలీస్ స్టేషన్ ఎదుటే ఈ ఘటన జరిగినా, పోలీసులు జోక్యం చేసుకోకపోవడంపై స్థానికులకు ఆశ్చర్యం కలిగించింది.

ర్యాగింగ్ చేయొద్దు : డీసీపీ

హసన్‌పర్తి, ఆగస్టు 9 : ర్యాగింగ్ పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని డీసీపీ ఎస్‌కే సలీమా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆమె అనంతసాగర్ శివారులోని ఎస్సా విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, సీఐ సురేశ్ పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమ అధికారి బాధ్యతల స్వీకరణ

హనుమకొండ, ఆగస్టు 9 : హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా శుక్రవారం బీ రాజమణి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా పనిచేసిన కే మధురిమ నర్సంపేటకు బదిలీ కాగా, హనుమకొండ ఉమెన్ హోం సీడీపీవో భాగ్యలక్ష్మికి తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా, హుజూరాబాద్ సీడీపీవోగా విధులు నిర్వర్తిస్తున్న బీ రాజమణికి హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కాజీపేట/సుబేదారి, ఆగస్టు 9 : గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కాజీపేట ఎస్సై లవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాజీపేట పట్టణం ఫాతిమా నగర్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం- సమాజాన్ని కాపాడుదాం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఏఎస్ శ్యాంసుందర్, లుహా ఏజీఎం బొజ్జ శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, చిరంజీవి, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా హనుమకొండ నయీంనగర్‌లోని చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సతీశ్, దామోదర్, డీన్ కవిత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

పోల్ నంబరింగ్‌ను వేగవంతం చేయాలి

■ 'పాలం బాట'తో సత్ఫలితాలు ■ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 9: యూనిక్ పోల్ నంబరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన హనుమకొండ సర్కిల్ ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ ఆపరేషన్, కన్‌స్ట్రక్షన్, కమర్షియల్, ఎంఆర్‌టీ, డీపీఈ శాఖలు, ఎస్ఏవో, ఏఏవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహ